క్లుప్తంగా

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో గురువారం అగ్నిమాపక దళ వారోత్సవాలను ఆర్డీఓ రాజేశ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా కరపత్రాలు, పోస్టర్లను విడుదల చేసినట్లు చెప్పారు.

గ్రామపంచాయతీకి రూ.3.56 లక్షల ఆదాయం

లింగాల: లింగాల మేజర్ గ్రామపంచాయతీకి తైబజార్ వేలం ద్వారా రూ.3,56 లక్షల ఆదాయం సమకూరింది. గురువారం సర్పంచ్ కోనేటి తిరుపతయ్య ఆధ్వర్యంలో 2023–24 సంవత్సరానికి గాను తైబజార్ వేలం నిర్వహించారు. సాయికుమార్ రూ.3.56 లక్షలకు వేలం దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. పంచాయతీ నిబంధనల ప్రకారమే తైబజార్‌ను వసూలు చేయాలని, నిబంధనలను అతిక్రమిస్తే వేలం రద్దు చేసే అధికారం పంచాయతీకి ఉంటుందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి భాగ్యమ్మ పాల్గొన్నారు.

తాగునీటిపై దృష్టి సారించండి

బిజినేపల్లి: ఎండలు తీవ్రం అవుతుండటంతో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గ్రామాల్లో తాగునీటిపై దృష్టి సారించాలని బిజినేపల్లి జెడ్పీటీసీ తూము హరిచరణ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో మత్స్య పారిశ్రామిక భవనం వద్ద జెడ్పీ నిధుల నుంచి బోరు వేసి మోటారు బిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని, అవసరమైన చోట బోర్లు వేసి తాగునీటిని అందించేందుకు కృషి చేయాలని సూచించారు. మత్స్య పారిశ్రామిక సంఘం నాయకులు తుమ్మల అల్లోజీ, పర్వతాలు, ఆంజనేయులు, సిద్దుల ఆంజనేయులు, లక్ష్మయ్య, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

బ్రిలియంట్ విద్యార్థుల ప్రతిభ

కల్వకుర్తి: రాష్ట్ర స్థాయి గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పరీక్షల్లో పట్టణానికి చెందిన బ్రిలియంట్ పాఠశాల విద్యార్థులు ముగ్గురు సత్తా చాటి సీట్లు సాధించారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న అనూష, స్ఫూర్తి బైపీసీ విభాగంలో, రిషితేజ్ ఎంపీసీ ఐఐటీ విభాగంలో టాపర్లుగా నిలిచారు. పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి టాపర్లుగా నిలవడంపై గురువారం ప్రిన్సిపాల్ రేణుధర్ ఉపాధ్యాయులను అభినందించారు. ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించడంతో పాటు బ్రిలియంట్ విద్యాసంస్థల్లో బోధిస్తున్న ఐఐటీ విద్యావిధానం ఐఐటీ సీట్లు సాధించేలా చేసిందన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోండి



కందనూలు: జిల్లాకేంద్రంలోని హౌసింగ్ బోర్డు ప్రాథమిక ఉర్దూ పాఠశాలలో కంటి వెలుగు శిబిరాన్ని వైద్యాధికారులు నిఖిల్‌రెడ్డి, స్రవంతి గురువారం ప్రారంభించారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకోవాలని కౌన్సిలర్ తీగల సునేంద్ర కోరారు. కార్యక్రమంలో భాస్కర్, ప్రవీణ్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లింగాల: మండలంలోని అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని దత్తారంలో గురువారం 'కంటి వెలుగు' కార్యక్రమాన్ని సర్పంచ్ జంగమ్మ ప్రారంభించి మాట్లాడారు. కంటి చూపు సమస్యలు ఉన్న ప్రతిఒక్కరూ కేంద్రానికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైద్యులు బాలకృష్ణ, సాయిచంద్ర, మౌనిక, శైలజ, రాంచందర్, మార్కం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటా..

కొల్లాపూర్: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన కాంగ్రెస్ పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు జహీదాబేగం కుటుంబాన్ని గురువారం ఆ పార్టీ నాయకులు చింతలపల్లి జగదీశ్వర్‌రావు పరామర్శించారు. జహీదాబేగం మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఆమె కుటుంబానికి పార్టీపరంగా అండగా ఉంటామన్నారు. ఆమె పిల్లల చదువులకు తాను ఆర్థిక సహకారం అందిస్తానని జగదీశ్వర్‌రావు వెల్లడించారు. ఆయన వెంట రాముయాదవ్, ఖాదర్‌పాష, కాంతారావు, యూనూస్, చిన్నరాము, రాంచందర్ తదితరులున్నారు.

రైతులకు డ్రమ్‌సీడర్ పరికరాలు పంపిణీ

పెద్దకొత్తపల్లి: మండల పరిధిలోని చంద్రకల్‌కి చెందిన రైతులకు నూతన వరిసాగు చేపట్టేందుకు అడవితల్లి సంస్థ ద్వారా ఉచితంగా డ్రమ్‌సీడర్ పరికరాలను పాలెం కృషి విజ్ఞాన్ కేంద్రంలో గురువారం పంపిణీ చేసినట్లు ఆ సంస్థ డైరెక్టర్ సురేష్ తెలియజేశారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త, డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి పొందేందుకు వరిలో డ్రమ్‌సీడర్‌లను వాడాలని సూచించారు. లక్ష్మీపతి, నర్సింహ, కురుమయ్య, సురేష్ పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం



పెంట్లవెల్లిలో విగ్రహ ఆవిష్కరణ చేస్తున్న ప్రజా ప్రతినిధులు

కొల్లాపూర్ రూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ.. ప్రజలకు వనరులు, వసతుల కల్పనకు కృషి చేస్తుందని మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని నార్లాపూర్ పెద్దవాగుపై రూ.9 కోట్లతో నిర్మాణం చేస్తున్న హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం ఎల్లూరులో గిరిజన సంక్షేమ శాఖ నిధులు రూ.16 లక్షలతో నిర్మాణం చేసిన ఆరోగ్య ఉపకేంద్ర నూతన భవనాన్ని ఎంపీ రాములు, కలెక్టర్ ఉదయ్‌కుమార్, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. అంతకు ముందు అంకిరావుపల్లిలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు స్థానికంగా వైద్యం అందుబాటులోకి రావాలని సీఎం కేసీఆర్ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఉమ్మడి జిల్లాలో 6 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేశామన్నారు. విద్య, వైద్యం కోసం ప్రభుత్వం రూ.వేల కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. దేశంలోని ప్రజల ఆస్తులను కేంద్ర ప్రభుత్వం ఇద్దరి వ్యక్తులకు అప్పజెప్పిందని విమర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ రాములు మాట్లాడారు. సీఎం కేసీఆర్ రాష్ట్ర రాజధానిలో 125 అడుగుల నిలువెత్తు అంబేద్కర్ విగ్రహాన్ని 14న ప్రారంభిస్తారన్నారు. ఆయన ఆశయాల కోసం అందరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. అంబేద్కర్ తర్వాత దళితులకు న్యాయం చేస్తున్న మహానుభావుడు సీఎం కేసీఆర్ అని కొనియాడారు. జెడ్పీచైర్మన్ శాంతకుమారి, జిల్లా వైద్య అధికారి సుధాకర్‌లాల్, ఎంపీపీ బోజ్యానాయక్, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ..

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన డా.బిఆర్ అంబేద్కర్ నూతన విగ్రహ ఆవిష్కరణకు ఎంపీ రాములు, ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అంబేద్కర్ యువజన సంఘం మహిళలు, చిన్నారులు, ప్రజాప్రతినిధులు కలిసి బొడ్డెమ్మలు, కోలాటాలు, పాటలతో ముఖ్య అతిథులను, ప్రజాప్రతినిధులను ఘనంగా ఆహ్వానించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ చేసి పూలమాలలు వేసి జైభీం అంటూ నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, ఎంపీ రాములు, ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ శాంతకుమారి మాట్లాడారు. సమాజంలో విద్య గొప్ప ఆయుధమని, దానికి మించిన శక్తి ఇంకోటి లేదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కెతూరి వెంకటేష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్ నాయక్, సుధారాణి, నరేందర్‌రెడ్డి, అంబేద్కర్ యువజన సంఘం, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

'చలో అచ్చంపేట' పోస్టర్లు విడుదల



మన్ననూర్‌లో వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు గ్రామస్తులు

కొల్లాపూర్: మన్ననూరు ఎస్సీ గురుకుల పాఠశాలలో అనుమానాస్పదంగా మృతిచెందిన నిఖిత మృతిపై జుడీషియల్ విచారణ జరిపించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి కోళ్ల శివమాదిగ డిమాండ్ చేశారు. గురువారం ఆయన కొల్లాపూర్‌లో ఎమ్మార్పీఎస్, బహుజన సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. నిఖితది హత్యేనని ఆరోపించారు. ఈ విషయాన్ని దాచిపెట్టేందుకు అధికార యంత్రాంగం ప్రయత్నించడం దారుణమన్నారు. నిఖిత హత్యకు నిరసనగా న్యాయ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 16న చలో అచ్చంపేట కార్యక్రమం చేపట్టనున్నట్లు చెప్పారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో పోస్టర్లు విడుదల చేశారు. ఎరమోని యాదగిరి మాదిగ, అగ్రస్వామి, రాములు, పరమేష్, లక్ష్మణ్, రమేష్, నర్సింహ, నిరంజన్ పాల్గొన్నారు.

మన్ననూర్: స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో హత్యకు గురైన నిఖితకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల పక్షం ఆధ్వర్యంలో ఈ నెల 16న నిర్వహించనున్న ఆందోళన కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను గురువారం తుర్కపల్లిలో విడుదల చేశారు.

ఉప్పునుంతల: విద్యార్థిని నిఖిత హత్యను నిరసిస్తూ 16న అఖిలపక్షం ఆధ్వర్యంలో చేపట్టనున్న చలో అచ్చంపేట కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను గురువారం మండల కేంద్రంలో నిఖిత న్యాయ జేఏసీ ఆధ్వర్యంలో విడుదల చేశారు. కార్తీక్ మాదిగ, ఆంజనేయులు, వెంకటేష్, కట్టా అనంత రెడ్డి, వెంకటయ్య, బాలరాజు పాల్గొన్నారు.

చెంచులను ఆదుకోవాలి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న చత్రునాయక్

మన్ననూర్: చెంచుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఐటీడీఏ సంస్థ ద్వారా చెంచులను ఆదుకోవాలని వటువర్లపల్లి సర్పంచ్ చత్రునాయక్ కోరారు. కలెక్టర్ ఉదయ్ కుమార్ పాల్గొన్న ఓ కార్యక్రమంలో ఆయన చెంచుల ఆరోగ్యం, కనీస సౌకర్యాల కల్పనను ఉద్దేశించి మాట్లాడారు. గతంలో ఐటీడీఏ కార్యాలయం సుండిపెంటలో ఉన్న సమయంలో చెంచులపై పూర్తి స్థాయిలో సహకారం అందించేవారని అన్నారు. మన్ననూర్‌లో కార్యాలయం ఏర్పడినప్పటి నుంచి చెంచులను పట్టించుకోపోవడంతో వారి జీవన పరిస్థితులు దుర్భరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఖాళీగా ఉన్న మినీ అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులను భర్తీ చేయాలని కోరారు. స్పందించిన కలెక్టర్ తక్షణమే అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేసినట్లు చెప్పారు.

యురేనియం తవ్వకాలపై బీజేపీ ద్వంద్వ వైఖరి వీడాలి



నిరసనలో పాల్గొన్న సీపీఎం, గిరిజన సంఘం నాయకులు

అచ్చంపేట రూరల్: నల్లమల అడవిలో యురేనియం తవ్వకాల అనుమతి ఇవ్వడం లేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని నిందిస్తూ.. రాజ్యసభలో బీజేపీ జాతీయ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ ప్రస్తావించడం నల్లమల ప్రజల మనోభావాలు దెబ్బతీయడమేనని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దేశ్యానాయక్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి శంకర్‌నాయక్ అన్నారు. గురువారం అచ్చంపేట అంబేద్కర్ చౌరస్తాలో తవ్వకాల పేరుతో చేసిన ప్రకటనను నిరసిస్తూ.. సీపీఎం, గిరిజన సంఘం, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. యురేనియం తవ్వకాలపై బీజేపీ ద్వంద వైఖరి వీడాలని డిమాండ్ చేశారు. గతంలో చేసిన ఉద్యమాలతో ప్రభుత్వాలు వెనక్కి తగ్గాయన్నారు. నల్లమల ప్రాంత ప్రజలకు లక్ష్మణ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నాయకులు చంద్రయ్య, జంగయ్య, కృష్ణయ్య, దగ్గు, రాములు, బక్కయ్య, నిరంజన్, బాలస్వామి పాల్గొన్నారు.

పట్టించుకోని విద్యుత్ సిబ్బంది



వైర్లను సరిచేస్తున్న రైతులు

తాడూరు: గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సిబ్బంది అందుబాటులో లేక విద్యుత్ సరఫరాలో ఏ చిన్న సమస్య వచ్చినా.. తప్పని పరిస్థితుల్లో రైతులే పనులు చేసుకోవాల్సి వస్తుంది. విషయాన్ని విద్యుత్ సిబ్బందికి ఫోన్ ద్వారా తెలియజేసినా.. స్పందించడంలేదు. దీంతో రైతులే పనుల చేసుకుంటున్నారు. మండలంలోని ఆకునెల్లికుదురులో మేడిపూర్‌కు ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డు అనుసరించుకుని ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ దాదాపు 18 రోజుల కిందట కాలిపోయింది. రైతులే దాదాపు రూ.10 వేలు జమచేసుకుని గురువారం ట్రాక్టర్‌పై జిల్లా కేంద్రానికి తీసుకెళ్లి మరమ్మతు చేయించుకుని తామె తీసుకొచ్చామని చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసేందుకు విషయాన్ని విద్యుత్ సిబ్బందికి తెలియజేసినా.. రాకపోవడంతో తామె వైర్లు సరిచేకున్నామని రైతులు బాల్‌రెడ్డి, వెంకటేష్, రవీందర్ రెడ్డి, బాలవెంకటయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

మంత్రికి ఘన సన్మానం

వెల్దండ: మండల పరిధిలోని రాఘయపల్లిలో వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ రాములును గురువారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు గోలి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కల్వకుర్తిలో నిర్వహించే ఆత్మీయ సమ్మేళనానికి హాజరవుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎంపీ రాములు మార్గమధ్యలో రాఘయపల్లిలో కాన్వాయి ఆగింది. దీంతో బీఆర్‌ఎస్ నాయకులు స్వాగతం పలికి సన్మానించారు. నాగులునాయక్, వెంకటయ్యగౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

జూపల్లి వర్గీయుల ముందస్తు అరెస్ట్

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో గురువారం తెల్లవారుజామున మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు వర్గానికి చెందిన కొంత మందిని పెంట్లవెల్లి పోలీసులు అరెస్టు చేశారు. గురువారం పెంట్లవెల్లిలో మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి, ఎంపీ రాములు పర్యటన ఉన్నందున ముందస్తుగానే జూపల్లి వర్గం ఎంగంపల్లి తండా గోపినాయక్, మండల నాయకులు ఎర్ర శ్రీనివాసుల, మూలె కుమార్‌లను అరెస్ట్ చేశారు.

యువతి అదృశ్యం

లింగాల: మండల పరిధిలోని బాకారానికి చెందిన యువతి అదృశ్యమైన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగు చూసింది. తెల్కపల్లిలో డిగ్రీ రెండో ఏడాది చదువుతున్న యువతి ఈ నెల 11న కాలేజీకి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శ్రీనివాస్ తెలియజేశారు.

అంబేద్కర్ ఉత్సవాలను జయప్రదం చేయండి



తాడూరులో పూలమాలలు వేస్తున్న విద్యార్థులు



మాట్లాడుతున్న జీవన్‌కుమార్

అచ్చంపేట రూరల్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని మాల ఉద్యోగుల ఐక్యవేదిక డివిజన్ అధ్యక్షుడు జీవన్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం అచ్చంపేటలో విలేకరులతో మాట్లాడారు. అచ్చంపేటలో మాల ఉద్యోగుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో రెండేళ్లుగా అంబేద్కర్ జయంతి వేడుకలతో పాటు వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 14న అంబేద్కర్ జయంతి ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళికా సిద్ధం చేశామన్నారు. ర్యాలీగా వచ్చి అంబేద్కర్ విగ్రహానికి గజమాలతో అలంకరణ ఉంటుందన్నారు. జనార్దన్, పాండు, వెంకటేష్, బాలస్వామి, శంకర్, నిరంజన్, లక్ష్మీనారాయణ, వెంకటయ్య, పాల్గొన్నారు.

యాపట్ల పాఠశాలలో..



యాపట్ల పాఠశాలలో..

పెద్దకొత్తపల్లి: యాపట్ల ప్రాథకోన్నత పాఠశాలలో గురువారం అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయులు శాఖీర్‌పాషా పూలమాలలు నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుల మంజుల, ప్రవీన్, సురేష్, నిర్మల పాల్గొన్నారు.

తాడూరు: మండలంలోని అల్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఉపాధ్యాయులు రవి, మోహన్‌సాగర్, ఆశకార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూలీలు వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి

వెల్దండ: జాతీయ ఉపాధిహామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలు వేసవిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీటీసీ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని మద్రిగుంతతండా, కేస్లీతండాలో ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కూలీలు ఉదయం త్వరగా పనులకు వెళ్లి ముగించుకుని రావాలన్నారు. అనంతరం మస్టర్లను పరిశీలించారు.

బీపీ మండల్ ఆశయాలు కొనసాగిస్తాం



నాగర్‌కర్నూల్‌లో నివాళి అర్పిస్తున్న నాయకులు

కొల్లాపూర్: పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో యాదవ జాగృతిసేన నాయకులు, ఎస్ఎల్‌వీఆర్‌డీఎస్ సంస్థ కార్యాలయం వద్ద బహుజన ఐక్యవేదిక నాయకులు బీపీ మండల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బీసీలకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించిన మహానుభావుడు మండల్ అని కొనియాడారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో యాదవ జాగృతిసేన నాయకులు మేకల రాముడుయాదవ్, బాలయ్య, సత్యనారాయణ, విష్ణుమూర్తి, సాయిలు, గడ్డం శేఖర్, భాస్కర్ పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ రూరల్: నాగర్‌కర్నూల్ జిల్లా జాతీయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం బీపీ మండల్ 41వ వర్ధంతిని నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పెద్దయ్య యాదవ్, నిరంజన్, మల్లేశ్‌గౌడ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

లింగాల: 'ఉపాధి కూలీలను పట్టించుకోని అధికారులు' అని గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండల పరిధిలోని జీల్గుపల్లి తండాకు చెందిన ఉపాధి కూలీలు ఈ నెల 11న పనులు చేస్తున్న సమయంలో ఒక్కసారిగా తెనెటీగలు దాడి చేయడంతో ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నారు. ఆ సమయంలో అధికారులు ఎవ్వరు కూడా తమను పట్టించుకోలేదని బాధిత కూలీలు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఎంపీడీఓ గీతాంజలి తండాను సందర్శించి సంఘటనకు సంబంధించిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

తండాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



పనులు ప్రారంభించిన శాంతిగోపాల్

వెల్దండ: మారుమూల ప్రాంత గిరిజన తండాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని వైస్ ఎంపీపీ శాంతిగోపాల్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని నారాయణపూర్‌తండాలో బీటీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ఎంపీపీ మాట్లాడారు. గిరిజన తండాలను ప్రత్యేక గ్రామపంచాయతీలుగా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. అనంతరం పనులను ప్రారంభించారు. సర్పంచ్ అంజినాయక్, నరేష్, సురేందర్, తారాసింగ్, శంకర్, రమేష్ తదితరులు ఉన్నారు.

సమ్మె బాటలో విద్యుత్ ఉద్యోగులు



ఈగలపెంటలో నిర్వహించిన సమ్మె సన్నాహక సభలో పాల్గొన్న విద్యుత్తు ఉద్యోగులు

దోమలపెంట(అచ్చంపేట): వేతన సవరణతో పాటు ఇతర ప్రధాన డిమాండ్లను నెరవేర్చకుంటే ఈ నెల 17 నుంచి సమ్మె చేయనున్నట్లు టీఎస్‌పీఈ జేఏసీ, ఎస్ఎల్‌బీహెచ్‌ఈఎస్ యూనిట్ చైర్మన్ సునీల్, విద్యుత్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు లచ్‌కుమార్, యాదయ్య తెలిపారు. ఈగలపెంటలోని జెన్‌కో ఉద్యోగుల నివాస కాలనీలో బుధవారం రాత్రి సమ్మె సన్నాహక సభను ఏర్పాటు చేసి ఇంజినీర్లు, ఉద్యోగులనుద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కం తదితర అన్ని విద్యుత్తు సంస్థలు సమ్మె బాట పట్టనున్నట్లు చెప్పారు.

కులవివక్షను అంతం చేద్దాం..



కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: సమాజంలో మనువాదాన్ని మట్టుబెట్టి కుల వివక్షను అంతం చేద్దామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం సాధించే వరకు వాక్ ఫర్ సోషల్ జస్టిస్ అనే నినాదంతో గురువారం కొల్లాపూర్ చౌరస్తా నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించి, అనంతరం కలెక్టర్ ఏఓ శ్రీనివాస్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేల సంవత్సరాల నాటి బూజుపట్టిన మనువాద సిద్ధాంతాన్ని అమలు చేయాలని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. గోరక్ష ముసుగులో దేశంలో దళితులు, మైనార్టీలపై దాడులు చేస్తున్నారని అన్నారు. సమాజంలోని అన్ని రకాల పీడన దోపిడీల నుంచి సంపూర్ణ విముక్తి కోసం సీఐటీయూ కార్మిక సంఘం పోరాడుతుందన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, వర్ధం పర్వతాలు, సహాయ కార్యదర్శి మల్లేశ్, దశరథం, గుంపల్లి అశోక్, రాములు, తిరుపతయ్య, రాజు పాల్గొన్నారు.

మరోసారి గులాబీ జెండా ఎగురవేస్తాం..



కల్వకుర్తిలో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కల్వకుర్తి రూరల్: రాష్ట్రంలో మరోసారి గులాబీ జెండా ఎగరడం ఖాయమని రాష్ట్ర ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని శివాజీచౌక్, హైదరాబాద్ చౌరస్తా, మహబూబ్‌నగర్ చౌరస్తాలో బీఆర్ఎస్ జెండాలను ఎగురవేశారు. అనంతరం పాలమూరు చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీలు ఎన్ని కుట్రలు చేసినా ఫలితం లేదన్నారు. మరోసారి సీఎంగా కేసీఆర్ ప్రమాణస్వీకారం చేస్తారని చెప్పారు. కాంగ్రెస్ కను మరుగైతే బీజేపీకి సింగిల్ డిజిట్ ఎమ్మెల్యేలు మాత్రమే ఉంటారని ఎమ్మెల్యేలు బాలరాజు, జైపాల్‌యాదవ్, లక్ష్మారెడ్డి అన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ శాంతాకుమారి, వెల్దండ జెడ్పీటీసీ గీతారెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, జనార్దన్‌రెడ్డి, ఊర్కొండ ఎంపీపీ రాధజంగయ్య, కల్వకుర్తి ఎంపీపీ మనోహరా చెన్నకేశవులుతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్కెట్ పాలకవర్గం ప్రమాణస్వీకారం

రైతులకు మెరుగైన సేవలు అందేలా చూడాలని ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, డాక్టర్ గువ్వల బాలరాజు, జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కోరారు. గురువారం పట్టణంలోని సాయిబాలాజీ ఫంక్షన్ హాల్‌లో కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం అట్టహాసంగా జరిగింది. మార్కెట్ కార్యదర్శి భగవంత్, చైర్మన్ విజయ్‌గౌడ్, వైస్‌చైర్మన్ రాజేందర్‌రెడ్డి, డైరెక్టర్లు కల్మిచర్ల గోపాల్, గంగాధరాచారితో పాటు పలువురిని ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కల్వకుర్తి, అచ్చంపేట, జడ్చర్ల ఎమ్మెల్యేలతో పాటు రాష్ట్ర మంత్రి నిరంజన్‌రెడ్డి హాజరయ్యారు. ప్రమాణస్వీకారోత్సవంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, పీఏసీఎస్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, ఎంపీపీ మనోహరా, గోవర్దన్ పలువురు పాల్గొన్నారు.

రంజాన్ కానుకల పంపిణీ

కల్వకుర్తి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గురువారం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ రంజాన్ సందర్భంగా కల్వకుర్తి, వెల్దండ, తలకొండపల్లి, కడ్తాల్, ఆమనగల్లు, మాడ్గుల మండలాలకు చెందిన ముస్లిం మైనార్టీలకు రంజాన్ కానుకలు అందజేశారు. ఆర్డీఓ రాజేశ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, ఎంపీపీ మనోహర్, లక్ష్మి నర్సింహారెడ్డి, లచ్చిరాంనాయక్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే చేసింది శూన్యం



లింగాల కోదండరామాలయంలో పూజలు చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ, పార్టీ శ్రేణులు

లింగాల: మండల కేంద్రంలోని కోదండరామాలయం అభివృద్ధికి ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఏ మాత్రం శ్రద్ధ చూపలేదని మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ విమర్శించారు. గురువారం ఆలయంలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి డీసీసీ అధ్యక్షుడు ప్రత్యేక పూజలు చేశారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఆలయంలో మరమ్మతు పనులు చేయించామని, దాతల సహకారంతో ఆలయం అభివృద్ధి జరుగుతుందే తప్పా.. గువ్వల బాలరాజు రెండు సార్లు ఎమ్మెల్యేగా అయినప్పటికీ ఆలయానికి ఒక్క పైసా ఇవ్వలేదని విమర్శించారు.

రాయవరంలో జోడో యాత్ర

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన హాథ్‌సేహాథ్ జోడో అభియాన్ యాత్ర గురువారం మండలంలోని రాయవరంలో కొనసాగింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే వరంగల్ డిక్లరేషన్ అంశాలను అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్‌ను ఆదరించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.